

పనులు సాగక..

రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండటంతో కొడంగల్ పట్టణ వాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 8లో▸



ఫేక్ ఓటర్లపై విచారణ

ధారూరు మండలం ఎబ్బనూర్‌లో ఫేక్ ఓటర్లు ఉన్నారనే ఫిర్యాదుపై డీఆర్‌ఓ మంగీలాల్ విచారణ చేపట్టారు. 8లో▸



స్కాలర్‌షిప్‌లు విడుదల..

స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 9లో▸

రోగులు కిటకిట | వైద్యం వెలవెల!

తాండూరు జిల్లా ఆస్పత్రిలో వెంటాడుతున్న వైద్యుల కొరత

జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో రోగులకు నామమాత్రపు వైద్య సేవలు అందుతున్నాయి. పీహెచ్‌సీల నుంచి మెరుగైన వైద్యం కోసం వచ్చే వారిలో ఎక్కువ మంది ప్రైవేటు బాట పడుతున్నారు. జిల్లాలో నాలుగు పెద్దాస్పత్రులు ఉన్నాయి. అందులో పరిగి, కొడంగల్‌లో కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, తాండూరు జనరల్ ఆస్పత్రి, వికారాబాద్‌లో బోధనా స్పత్రి ఉంది. వీటిలో పరీక్షలకు సరిపడా పరికరాలు లేకపోవడం, వైద్యులు నగరం నుంచి వస్తుండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా ఓపీకి అనుకున్నంత మేర రోగులు రావడం లేదు. జిల్లాలోని సీహెచ్‌సీల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై గురువారం 'సాక్షి' విజిట్ చేసింది. – వికారాబాద్



తాండూరు: మాతా శిశు కేంద్రం వద్ద టోకెన్ల కోసం మహిళల క్యూ

- 50 మంది డాక్టర్లకు గాను 20 మందే..
- ఉన్నవారికీ డిప్యూటేషన్ బాధ్యతలు
- గంటల తరబడి క్యూలో రోగులు
- వికారాబాద్, పరిగి ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి
- కొడంగల్‌లో కాస్త మెరుగు

తాండూరు: పేరుకే జిల్లా ఆస్పత్రి.. వైద్య సేవలు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. తాండూరు పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వైద్యులు మాత్రం అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ సర్జన్లు, స్పెషలిస్టు వైద్యులు 50 మంది వరకు ఉండాలి. కానీ 20మంది మాత్రమే ఉన్నారు. 12కు గాను 7 సివిల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఐదు మందిలో ఒకరు మెదక్ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఎస్ఆర్ఎంఓ పోస్టు ఖాళీగా ఉంది. 25 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు గాను 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 16 మంది వైద్యులకు గాను 5 మంది ఇతర ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. డిప్యూటీ సివిల్ సర్జన్లు 8 పోస్టులకు గాను 5 ఖాళీగా ఉన్నాయి. ఉన్న 5 మందిలో ఇద్దరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో 24 గంటల వైద్య సేవలకు ఇబ్బందికరంగా మారింది.

గంటల తరబడి క్యూలో..

గురువారం ఒక్క రోజే 710 మంది రోగులు వివిధ ఆరోగ్య సమస్యలపై ఆస్పత్రికి వచ్చారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఔట్ పేషెంట్లు క్యూ కట్టారు. రోగుల సంఖ్యకు తగినంత మంది వైద్యులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. సకాలంలో వైద్యం అందక రోగులు డాక్టర్లతో గొడవకు దిగారు. 12 గంటల తర్వాత ఓపీ సేవలు ఆపేశారు. మాతాశిశు ఆస్పత్రిలో 5 మంది గైనకాలజిస్టులు, 5 మంది చిన్నపిల్లల వైద్యులు ఉండాలి. కానీ అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఆ రెండు విభాగాల్లో ఇద్దరు వైద్యులు కాంట్రాక్ట్ పద్ధతిన సేవలు అందిస్తున్నారు. గురువారం 435 మహిళలు, చిన్నారులు వైద్య సేవలు పొందారు.

సరైన వైద్యం అందక..



పరిగి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులు

పరిగి: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు లేకపోవడం, సరైన వైద్య సేవలు అందక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పరిగి మండలం తోపాటు, దోమ, కుల్కచర్ల, బొంరాస్‌పేట్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. రోజూ 300 నుంచి 350 మంది వరకు ఓపీ ఉంటుంది. 20 మందికిపైగా ఇన్‌పేషెంట్లు ఉన్నారు. ఇంత రద్దీ ఉండే ఆస్పత్రిలో వైద్యులు రోగులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 8 మంది డాక్టర్లు, 50 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి నెలా 20కి పైగా ప్రసవాలు చేస్తున్నారు. షిఫ్ట్‌ల వారీగా డెంటల్, గైనకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్యులు పని చేస్తున్నారు. అత్యవసర చికిత్సలు రోడ్డు ప్రమాదాలు ఇతర కేసులు వస్తే వైద్యులు వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పట్టించుకోవడం లేదు



నేను పరిగి పట్టణంలోని తుంకుల్‌గడ్డలో ఉంటా. తెలిసిన మహిళ కడుపుతో ఉండటంతో ఆస్పత్రికి తీసుకొచ్చా. ఇక్కడి వైద్యులు పట్టించుకోవడం లేదు. ఆశావర్కర్లతో రావాలని అంటున్నారు. వారు లేరని చెప్పినా చికిత్స చేయలేదు. మా కాలనీ నుంచి నిత్యం ప్రజలు వస్తుంటారు. ఎవ్వరికీ సరైన వైద్యం అందడం లేదు.

– భారతి, తుంకుల్‌గడ్డ, పరిగి



వికారాబాద్: వైద్యం కోసం వచ్చిన రోగులు

❖ వికారాబాద్‌లో పరిస్థితి ఇదీ..

వికారాబాద్: ఏడాది క్రితం నుంచి వికారాబాద్‌లో 330 పడకల బోధనాస్పత్రి కొనసాగుతోంది. రెండు నెలల క్రితం కొత్త భవనంలోకి ఆస్పత్రిని మార్చారు. అత్యవసర విభాగానికి చెందిన భవనం ఒక్కటే అందుబాటులోకి రావాల్సి ఉంది. ఇక్కడ 86 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 70 మంది రెగ్యులర్, నలుగురు కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. 135 మంది హెడ్ నర్సులు, 36 మంది నాల్గో తరగతి ఉద్యోగులు సేవలందిస్తున్నారు. కుటుంబ నియంత్రణ, అపెండెక్స్ తదితన ఆపరేషన్లు చేస్తున్నారు. అనుమతులు వచ్చినా ఇంకా సిటీ స్కానింగ్ యంత్రాన్ని కొనుగోలు చేయలేదు. ప్రస్తుతం రోజుకు సగటున 400 నుంచి 500 మంది వరకు ఓపీ నమోదవుతోంది. 20 నుంచి 30 మంది వరకు ఇన్ పేషంట్లు ఉన్నారు. టీ హబ్ ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నా ఇంకా టూడీ ఈకో(గుండె సంబంధిత) పరీక్షల మిషన్ రాలేదు. సాధారణ మందులు అందుబాటులో ఉన్నాయి.

❖ రోజూ 300 మందికి పైగా..

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం కావడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. నిత్యం 300 మందికి పైగా రోగులు వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆస్పత్రి స్థాయిని పెంచి 220 పడకల టీచింగ్ హాస్పిటల్‌గా అప్ గ్రేడ్ చేశారు. ఇందులో భాగంగా అన్ని వసతులతో కూడిన నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 134 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. బయో కెమిస్ట్రీలో 56, పాథలాజీలో 37, మైక్రో బయోలజీలో 41 రకాల పరీక్షలు చేస్తున్నారు. ప్రతి రోజూ రక్త, మూత్ర, ఇతర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు.



కొడంగల్ ఆస్పత్రిలో..

సీఎంఆర్ తక్షణం అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: యాసంగి సీజన్ 2024–25కు సంబంధించి బకాయి కస్టమ్ మిల్లింగ్ బియ్యం(సీఎంఆర్)ను మిల్లర్లు తక్షణం అందజేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. అలాగే ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన బియ్యం డెలివరీని వేగవంతం చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లు సామర్థ్యం మేరకు సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి అందజేయాలన్నారు. బ్యాంక్ గ్యారంటీ లేకుండా వడ్లు ఇవ్వడానికి వీలు లేదన్నారు. ఎఫ్‌సీఐ అధికారులు డెలివరీకి అనుగుణంగా గోదాంలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ మోహన్‌కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

జీవన్గీ పాఠశాలకు మహర్దశ

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: వరండా చదువులు ఇంకెన్నాళ్లు శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. మండలంలోని జీవన్గీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, వసతులు లేక విద్యార్థులు పడుతున్న బాధలను 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఉదయం పాఠశాలను మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ యశ్వంత్, సిబ్బంది సందర్శించారు. రూ.40 లక్షలతో కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ రాములు, కాంగ్రెస్ నాయకులు దేశ్‌ముఖ్ సంగారెడ్డి, తలారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న సీఈఓ సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోండి

ఈవీఎంల గోదాంను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని జిల్లా ఈవీఎం గోదాంను గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. ముందుగా ఆయన కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ బొకే అందజేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ఈవీఎంలు భద్రపరిచిన గోదాంకు వెళ్లారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్ తీశారు. అనంతరం ఈవీఎంలు, బ్యాలెట్, కంట్రోల యూనిట్లు, ఎన్నికల సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. అనంతరం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. బీఎల్ఓల పేర్లు ఇచ్చారా..? ఓటరు జాబితా పూర్తయ్యిందా అని అడిగారు. కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఆర్ఓ మంగీలాల్, ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నెమత్ అలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు'ను పూర్తి చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

- ఎన్నికల హామీలను అమలు చేయాలి
- ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి సకాలంలో పనులు పూర్తి చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజల వద్దకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కేటాయిస్తే కొడంగల్‌తో పాటు నారాయణపేటకు సాగునీరు అందుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు నిధులు కేటాయించడం లేదని, తులం బంగారం ఇస్తామని మాట తప్పారని అన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని, రైతు బంధు రావడం లేదన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుయాదవ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, యాదగిరి, రమేష్‌బాబు, నర్మద కిష్టప్ప, మహిపాల్, భీములు, శేరి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సముద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా 'పాంబండ'



ఆలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి
- టూరిజం శాఖ ఈడీ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆలయం సందర్శన

కుల్కచర్ల: పాంబండ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ టూరిజం శాఖ ఈడీ ఉపేందర్ రెడ్డితో కలిసి శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రోప్ వే, రిసార్ట్స్ నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆలయ అర్చకులు పాండు శర్మ, డీసీసీ కార్యదర్శి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యూత్ విభాగం అధ్యక్షుడు జంగయ్య, నాయకులు గోవర్ధన్ రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, వెంకటయ్య, రాధారెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పరిగి: క్రీడలు ఆడటంతో మానసిక ఉల్లాసం పెంపొందుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని మినీ గ్రౌండ్‌లో 69వ ఎస్‌జీఎఫ్ పరిగి జోనల్‌స్థాయి అండర్ 14, 17 కబడ్డీ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు క్రీడల్లో రాణించి పరిగికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల, స్ఫూర్తి, శారీరక క్రమశిక్షణ పొందుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంటుందన్నారు.

ప్రతి పేదవాడికీ నాణ్యమైన వైద్యం

అంతకుముందు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, టీఆర్ఆర్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. గతంలో కంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. పరిగిలో త్వరలోనే వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి రానుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, కుల్కచర్ల ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు హన్మంతుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

తాండూరు టౌన్: ప్రయాణికులు బస్సుల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాండూరు ఆర్టీసీ డిపో మేనేజన్ సురేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు సెల్ నంబర్ 9959226251కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

నేడు చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

తాండూరు టౌన్: చిన్నారులు ఎదుర్కొంటున్న వ్యాధులు, నిర్ధారణ, నివారణ, చికిత్స కోసం నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ గిరిధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరులోని ఇందిరానగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను వైద్య శిబిరానికి తీసుకురావాలని కోరారు.

బీజేపీకి మాట్లాడే హక్కు లేదు

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



నివాళులర్పిస్తున్న సీపీఎం కార్యదర్శి మహిపాల్ తదితరులు

ధారూరు: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై బీజేపీకి మాట్లాడే హక్కు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ అన్నారు. గురువారం ధారూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం పాలన తరహాలోనే ప్రధాని మోదీ పాలన సాగుతోందని ఆరోపించారు. కమ్యునిస్టుల పోరాట చరిత్రను వక్రీకరించారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మయ్య, మల్లయ్య, వెంకటేశ్, సుదర్శన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కొడంగల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కమిటీని గురువారం పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొడంగల్ శాఖ అధ్యక్షుడిగా కె.రాధాకృష్ణ, కార్యదర్శిగా డి.వెంకటయ్య, కోశాధికారిగా చంద్రప్ప, అసోసియేట్ అధ్యక్షుడిగా హన్మయ్య, ఉపాధ్యక్షులుగా నర్సప్ప, కె.యాదగిరి, సహాయ కార్యదర్శిగా కె.ప్రభాకర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సిహెచ్.నరేందర్, ప్రచార కార్యదర్శిగా మోహన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా బాబుసింగ్, రఘువీర్‌సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.

సంఘాలను బలోపేతం చేయాలి

అదనపు కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంటే ఉంటే ఆ కుటుంబం బాగుంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 800 సంఘాలకు రూ.100 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించాలన్నారు. సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్, డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ రవి కుమార్, వెంకటేష్, రాజేంద్రప్రసాద్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువులకు మెరుగైన సేవలు



కార్యాలయంలో ఎద్దులకు చికిత్స చేస్తున్న సైదులు

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు రూరల్: స్థానిక పశు వైద్యశాలలో అధికారి లేరని సాక్షి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన 'ఏడీఏ లేక.. సేవలు సాగక' వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. ధారూరు మండలం కుక్కింద పశువైద్యశాల సబ్ సెంటర్‌లో పని చేస్తున్న ఫ్యారమేట్ సైదులును తాండూరు పశువైద్యశాల ఏడీఏ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారంలో మూడు రోజులు కుక్కింద పశువైద్యశాలలో.. మరో మూడు రోజులు తాండూరు ఏడీఏ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సైదులను ఆదేశించారు. ఇక నుంచి తాండూరులో గురు, శుక్ర, శనివారం మూడు రోజులు అందుబాటులో ఉండనున్నారు.

పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడి మృతి

దిక్కులేనివారైన భార్యాపిల్లలు



సంగప్ప (ఫైల్)

తాండూరు రూరల్: అనారోగ్యంతో ఓ పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. దీంతో భార్య, కూతురు అనాథలయ్యారు. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన బోడ సంగప్ప(33) పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పదిహేను రోజుల క్రితం జాండిస్‌కు గురికావడంతో పాటు కిడ్నీలో ఇన్‌ఫెక్షన్ సోకి ఉస్మానియా ఆస్పత్రిలో చేరాడు. ఆరోగ్యం విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి లాలప్ప, కారోబార్ నర్సిరెడ్డి నగరానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంగప్ప తల్లితండ్రులు కూడా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తూనే మృతిచెందారు. సంగప్ప మృతితో అతని భార్య అక్షిత, ఏడాదిన్నర కూతురు ఆరోగ్య దిక్కులేనివారయ్యారు. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం పెద్దేముల్‌లో సంగప్ప అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

చెట్టు కొమ్మ విరిగిపడి విద్యార్థికి గాయాలు



గాయపడిన విద్యార్థి సుశాంత్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న ఉపాధ్యాయులు

బషీరాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అండర్-14 క్రీడా పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన ఓ విద్యార్థిపై గురువారం చెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో అతడి తలకు తీవ్రగాయమైంది. వివరాల్లోకి వెళితే.. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కింద యాలల, బషీరాబాద్, తాండూరు టౌన్, తాండూరు రూరల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు జరుగుతున్నాయి. తాండూరు పట్టణం వాల్మీకీ నగర్‌కు చెందిన సుశాంత్ అనే విద్యార్థి మండలంలోని జినుగుర్తి మోడల్ స్కూల్ నుంచి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు హాజరయ్యాడు. తోటి విద్యార్థులతో పాఠశాల మైదానంలో చెట్టు కింద నిలబడ్డారు. అదేసమయంలో అకస్మాత్తుగా చెట్టు కొమ్మ విరిగికింద పడింది. మరో ఇద్దరు విద్యార్థులతో నిలబడి ఉన్న సుశాంత్ తలపై కొమ్మ పడింది. దీంతో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. ఉపాధ్యాయులు వెంటనే చికిత్స నిమిత్తం బాలుడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. దీంతో ఫైనల్ కబడ్డీ పోటీలు వాయిదా పడ్డాయి.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతుండగా ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు దాడి చేసి, ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. రావిర్యాల సమీపంలోని మైల్ స్టోన్ వెంచర్‌లో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సుజీవన్, తిరుపతయ్య, మహేష్, శేఖర్, సురేష్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.13,250 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పనులు సాగక.. వాహనాలు కదలక



- మహబూబ్‌నగర్-చించోలి జాతీయ రహదారి నిర్మాణంలో జాప్యం
- ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే రోడ్డు
- పట్టించుకోని అధికారులు

పర్సాపూర్ దగ్గర దిగబడిన భారీ లారీ

కొడంగల్: నత్తనడకన కొనసాగుతున్న రోడ్డు పనులతో కొడంగల్‌వాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మహబూబ్‌నగర్-చించోలి జాతీయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. కొడంగల్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్సాపూర్‌లో ఇటీవల వాహనాలు రోడ్డులో కూరుకుపోతున్నాయి. చివరకు బస్సులు, ఇతర వాహనాలను దారి మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు జారి కింద పడిన సంఘటనలు సైతం ఉన్నాయి. పనులు చేయించడంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాహనదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. జాతీయ నిర్మాణ పనులను రెండు బిట్లుగా విభజించి కాంట్రాక్టర్లకు అప్పగించారు. మహబూబ్‌నగర్ నుంచి దుద్యాల గేటు వరకు ఒక మోస్తరుగా పనులు జరిగాయి.

ద్విచక్ర వాహనదారులకు తిప్పలు

దుద్యాల నుంచి కొడంగల్, తాండూరు మీదుగా నిర్మిస్తున్న రహదారి పనులు మందకొడిగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ రహదారిపై వెళ్లాలంటే గగనంగా మారింది. భారీ వాహనాలు వెళ్లాలంటే డ్రైవర్లు భయపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డును కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా గుర్తించి 167ఎన్‌గా నామకరణం చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బూత్పూరు నుంచి కొడంగల్, తాండూరు, చించోలీ మీదుగా కర్ణాటక రాష్ట్రం మన్నెకెళ్లి వరకు జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. మన్నాకెళ్లి దగ్గర ముంబయి జాతీయ రహదారితో కలుస్తుంది. మొత్తం 150 కిలోమీటర్లు పొడవు గల ఈ జాతీయ రహదారి వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్లు ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డును అధికారులు, నాయకులు పట్టించుకొని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికుల అభ్యర్థన.



పర్సాపూర్‌లో రోడ్డుపై ఆగిన కారు

రూ.కోట్ల భూమి స్వాహా

- పనిమనిషికి మాయమాటలు చెప్పి అక్రమ రిజిస్ట్రేషన్
- సర్వే చేస్తుండగా నిలదీసిన బాధితుడు
- కిరాయి గుండాలతో దాడికి యత్నం



బాధితుడు సురేశ్‌కు అండగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాకంచర్ల గ్రామస్తులు

పూడూరు: ఇంట్లో పని చేసే మనిషికి ఆసరాగా ఉండాల్సిన యజమానులు దౌర్జన్యానికి పాల్పడి ఆమె భూమినే కాజేసిన సంఘటన మండలంలో కలకలం రేపింది. రూ.ఐదు కోట్ల విలువ చేసే భూమికి కేవలం రూ.ఐదు లక్షలకే దక్కించుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రాకంచర్ల గ్రామానికి చెందిన పద్మమ్మ నగరంలోని లింగంపల్లిలో ఓ ఇంట్లో పని చేస్తుంది(పనిమనిషి). ఆమెకు మండలంలోని పెద్ద ఉమ్మెంతాల్‌లో సర్వే నంబర్ 401లో రెండు ఎకరాల భూమి ఉంది. సదరు ఇంటి యజమానులు పద్మమ్మకు మాయమాటలు చెప్పి గుట్టుగా కుటుంబసభ్యులకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రూ.5 కోట్లకు విలువ చేసే భూమికి కేవలం రూ.5 లక్షలకే చేజిక్కించుకున్నారు. గురువారం సదరు భూమిలో సర్వే చేస్తుండగా పద్మమ్మ కొడుకు సురేశ్ అడ్డుకొని నిలదీశాడు. తామే భూమిని కొనుగోలు చేశామని పోచమ్మ 20 మంది కిరాయి గుండాలతో(సిక్కు) కలిసి తెలపడంతో అవాక్కయ్యాడు. ఎలా జరిగిందని ప్రశ్నించడంతో అతడిపై ఒక్కసారిగా దాడికి యత్నించారు. వెంటనే సురేశ్ గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి వచ్చి సర్వే ఆపే ప్రయత్నం చేశారు.

న్యాయం చేయండి

ఈ మేరకు పోలీసులు గుండాలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి వద్ద కత్తులు, లాఠీలు, కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక పోచమ్మ కుమారుడు సంపత్ ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అతడు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, ఈ వ్యవహారానికి మొత్తం సూత్రధారి అతడేనని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ పెంటయ్య ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. అమాయకుల భూములను కాజేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. బాధితుడు సురేశ్‌కు న్యాయం చేయాలని గ్రామస్తులు పార్టీలకతీతంగా పోలీసులను కోరారు. ఈ మేరకు చన్గోముల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు.

లైసెన్స్ సస్పెన్షన్



ఫర్టిలైజర్ షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ కొమురయ్య, ఏఓ అనిత

అధిక ధరలకు ఎరువులు విక్రయించిన షాపుపై చర్యలు

- ఆదేశాలు జారీ చేసిన తాండూరు ఏడీఏ కొమురయ్య
- హర్షం వ్యక్తం చేసిన రైతులు

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: 'విచారణ మమ'శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం స్పందించారు. ఆయన ఆదేశంతో బషీరాబాద్‌లోని 'సాయి ధనలక్ష్మి' ఫర్టిలైజర్ షాపు లైసెన్స్‌ను మరో పది రోజుల పాటు సస్పెన్షన్ చేస్తున్నట్లు ఏడీఏ కొమురయ్య ప్రకటించారు. అప్పటి వరకు షాపులో ఎరువుల విక్రయాలు నిర్వహించవద్దని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యజమానిని హెచ్చరించారు. అనంతరం నావంద్గీ సొసైటీలో యూరియా విక్రయాలపై సీఈఓ వెంకటయ్య నుంచి వివరాలు తెలుసుకున్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే సొసైటీలకు సైతం యూరియా సరఫరా నిలిపివేస్తామన్నారు. మండలానికి మరో వంద టన్నుల యూరియా అవసరమని అధికారులు ఏడీఏకు తెలిపారు.

రికార్డుల తనిఖీ..

యూరియా, డీఏపీ వంటి ఎరువుల కోసం అష్టకష్టాలు పడుతున్న సమయంలో తమ అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు విక్రయించారని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై వారం రోజుల క్రితం విచారణ చేపట్టిన వ్యవసాయ శాఖ అధికారులు దుకాణ నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం కంటి తుడుపు చర్యలతో సరిపెట్టే ప్రయత్నం చేయగా, సాక్షి ఈఅంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈనేపథ్యంలో ఏఓ అనితతో కలిసి గురువారం ఏడీఏ కొమురయ్య గురువారం మరోసారి బషీరాబాద్‌లోని ఫర్టిలైజర్ షాపు రికార్డులను తనిఖీ చేశారు. వారం రోజుల క్రితం జారీ చేసిన షోకాజ్ నోటీసుకు సంతృప్తికర సమాధానం చెప్పకపోవడంతో మరో పది రోజుల పాటు లైసెన్స్‌ను సస్పెన్షన్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించేలా చూడాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాలాల: పాత తాండూరు కాగ్నా నది నుంచి ఇసుక అనుమతి పొందిన ఓ ట్రాక్టర్ మండల పరిధి నుంచి రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు రెవెన్యూ అధికారుల నుంచి ఇసుక తరలింపునకు అనుమతి పొందిన ఓ ట్రాక్టర్ గురువారం మండల పరిధిలోని గోవిందరావుపేట కాకరవేణి నది నుంచి ఇసుకను దర్జాగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహన డ్రైవర్ వద్ద పాత తాండూరు కాగ్నా నది నుంచి ఇసుక తరలింపునకు తహసీల్దార్ జారీ చేసిన అనుమతిని పోలీసులు గుర్తించారు. కాగా పట్టుబడిన ట్రాక్టర్ ఓ రాజకీయ నాయకుడిది కావడంతో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయమై సోషల్ మీడియాలో చర్చనీయాంశం అయింది. పట్టుబడిన ట్రాక్టరును శాఖపరమైన చర్యల నిమిత్తం యాలాల తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బషీరాబాద్: పేకాట ఆడుతున్న ముగ్గురిని బషీరాబాద్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైల్వార్ గ్రామానికి చెందిన బక్కప్ప ఇంట్లో మద్యం తాగుతూ యాదప్ప, అశోక్‌లు పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి నుంచి రూ.2వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

నవాబుపేట: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి ఉపయోగపడే పౌరులను అందించాల్సిన బాధ్యత గురువుపైనే ఉందన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు.. వారి చేతిలోనే ఈ దేశ భవిష్యత్ ఉందన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, ఎంపీడీఓ అనురాధ, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, నాయకులు నాగిరెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎక్‌బాల్, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ ఓటర్లపై విచారణ

- హాజరైన 26 మందిలో 22 మంది నకిలీ ఓటర్లేనని తేల్చిన అధికారులు
- మిగిలిన నలుగురిపైనా అనుమానం, పూర్తి వివరాలు సేకరిస్తామని వెల్లడి
- ఎంక్వైరీకి రాని మరో 26 మంది



ధారూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరుపుతున్న డీఆర్‌ఓ మంగీలాల్

ధారూరు: మండల పరిధిలోని ఎబ్బనూర్‌లో పెద్ద సంఖ్యలో ఫేక్ ఓటర్లు ఉన్నారనే ఫిర్యాదులపై డీఆర్‌ఓ మంగీలాల్ విచారణ చేపట్టారు. ఓటరు జాబితాలో పేర్లున్న సుమారు 52 మందికి అధికారులు ముందుగానే నోటీసులు అందజేశారు. ఫేక్ ఓటర్లు కాని వారు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. ఈఅంశంపై గత బుధ, గురువారాల్లో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎంక్వైరీ చేపట్టారు. మొదటి రోజు 12 మంది, రెండో రోజు 14 మంది మొత్తం 26 మంది హాజరు కాగా వీరిలో 22 మంది ఫేక్ ఓటర్లేనని అధికారులు తేల్చారు. మిగిలిన నలుగురు తమకు కేవలం ఎబ్బనూరులో మాత్రమే ఓటు హక్కు ఉందని వాదించారు. అయితే వీరి ఓట్లు కూడా తాండూరులో ఉన్నాయనే అనుమానం ఉందని, దీనిపై కూడా విచారణ జరుపుతామని తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. మరో 26 మంది విచారణకు హాజరు కాలేదు. వీరు రాకపోతే ఫేక్ ఓటర్లుగా నిర్ధారిస్తామని స్పష్టంచేశారు.

దత్త పీఠాన్ని సందర్శించుకున్న స్పీకర్



స్వామివారి సన్నిధిలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: దిండిగల్‌లోని అవధూత దత్త పీఠాన్ని గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్పీకర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందచేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

తాండూరు టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీశ్రేణులు రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూవాహిని, పలు స్వచ్ఛంధ సంస్థల సభ్యులు, మోదీ అభిమానులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రపంచానికి భారతదేశ గొప్పదనాన్ని చాటి చెప్పిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ఆయన పాలనలో దేశ ప్రజలు సుభిక్షంగా వర్ధిల్లుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. ఈ శిబిరంలో నాయకులు సుభాన్ రెడ్డి, రజినీకాంత్, శ్రీలత, శ్రీహరి, గోపి, మల్లేశం, జగన్, వీరేందర్, మల్లు, శ్రీకాంత్, జగదీష్, కృష్ణ, కిరణ్, ప్రకాష్, శ్రీనివాస్, చందు, రఘు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సెమీ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించండి



విద్యుత్ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న స్పాట్ బిల్లింగ్ కార్మికులు

తాండూరు టౌన్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న స్పాట్ బిల్లింగ్ కార్మికులను టీజీఎస్‌పీడీసీఎల్(దక్షిణ విభాగం) సెమీ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి ఆర్డర్ కాపీని ఇవ్వాలని పలువురు తాండూరు విద్యుత్ డీఈ భానుప్రసాద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. గత 20 ఏళ్లుగా ఫీస్ రేట్ బేసిస్‌పై టీజీఎస్‌పీడీసీఎల్‌లో పని చేస్తున్న 1,300 మంది స్పాట్ బిల్లింగ్ కార్మికులకు పల్లెల్లో రూ.5 వేలు, పట్టణాల్లో రూ.7వేలు చెల్లిస్తున్నారన్నారు. చాలీ చాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అయితే గత నెలలో టీజీఎన్‌పీడీసీఎల్(ఉత్తర విభాగం) బిల్లింగ్ కార్మికులను సెమీ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి ఆర్డర్ కాపీలను అందజేసిందన్నారు. ఒకే రాష్ట్రంలో పనిచేస్తున్న కార్మికులకు ఒకే విధమైన విధానం లేకపోవడం సమంజసం కాదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి బిల్లింగ్ కార్మికులకు ఆర్డర్ కాపీలు ఇవ్వాలని, లేని ఎడల విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. లక్ష్మీకాంత్‌రెడ్డి, రఫీక్, ప్రతాప్ రెడ్డి, నర్సిములు, సంపత్, హన్మంతు తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

సీఎంను కలిసిన లగచర్ల నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన లగచర్ల నాయకులు

దుద్యాల్: మండలంలోని లగచర్ల, హకీంపేట్ గ్రామాల నాయకులు గురువారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. మండలంలో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడ పనులు వేగవంతంగా చేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ అనంతయ్య, నాయకులు యుగంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం


గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి



వేరుశనగ విత్తనాల బస్తాలిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: రైతులకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వ్యవసాయశాఖ నుంచి సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు అందజేశారు. వీసీసీ, బీఎల్‌డీ రకాల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తెలిపారు. ఎకరానికి నాలుగు బస్తాల చొప్పున మండలంలోని మెట్లకుంట, మదన్‌పల్లి, బురాన్‌పేట గ్రామాల రైతులకు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. మిగిలిన గ్రామాలకు సైతం వేరుశనగ విత్తనాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోలప్ప, ఏఈఓలు స్వాతి, హేమ, శైలజ, పవన్, జగదీశ్, నాయకులు సురేందర్‌రెడ్డి, సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో స్వచ్ఛ భారత్



ఆలయ సమీపంలో స్వచ్ఛ భారత్ చేస్తున్న బీజేపీ నాయకులు

యాలాల: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని రసూల్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గురువారం బీజేపీ నాయకులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ, బీజేపీ ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అంతకుముందు ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మండలంలో రోజుకో కార్యక్రమం చేపడుతున్నట్లు బాలేశ్వర్‌గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రామ్యనాయక్ తదితరులు ఉన్నారు.

యాలాలలో మరో కొత్త బోరు

మండల కేంద్రంలో ఎంపీ నిధుల్లో భాగంగా సగర కాలనీలో కొత్త బోరును మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా వేయించారు. సగర కమిటీ హాల్ సమీపంలో పూజల అనంతరం బోరును తవ్వించారు. సగర సంఘం నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

షాబాద్: విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతిచెందిన ఘటన షాబాద్ పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఊబగుంట గ్రామానికి చెందిన బుద్దమోళ్ల చంద్రయ్య(60) రోజు మాదిరిగానే ఉదయం పొలానికి వెళ్లాడు. వరి పంటకు నీరు పెట్టేందుకు మోటారు ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చేవెళ్ల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు దరశథ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్యూస్ తాగుతూ కుప్పకూలిన యువకుడు

ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాత

ఇబ్రహీంపట్నం రూరల్: జ్యూస్ తాగుతుండగా గుండెపోటు రావడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా పల్లిపాడుకు చెందిన మేడ ఏకలవ్య(30) ఇబ్రహీంపట్నంలోని తన స్నేహితు డు ఆకాష్‌పటేల్ వద్ద ఉంటున్నాడు. యూకే లో ఉండే ఏకలవ్య ఉద్యోగం పోవడంతో హైదరాబాద్ వచ్చాడు. అప్పటినుంచి జాబ్ కోసం ట్రై చేస్తున్నాడు. జ్యూస్ సెంటర్ వద్ద కింద పడిపోయిన అతన్ని పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చూడచక్కని ప్రకృతి అందాలు

పెద్దేముల్ మండలం నాగుపల్లి గ్రామ శివారులో ఉన్న అటవీక్షేత్రం ఆహ్లాదకర వాతావరణానికి నెలవుగా మారింది. నాగులపల్లి నుంచి సిద్ధన్నమడుగుతండాకు వెళ్లే ఈ రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు స్వాగతం పలుకుతున్నాయి. చుట్టూ చిన్న కొండల మధ్య ఉన్న ఘాట్ రోడ్డును చూడగానే ప్రకృతి ప్రేమికులు మైమరచి పోతున్నారు. తాండూరు నుంచి జహీరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఈ అందాలను ఆస్వాదిస్తున్నారు. – తాండూరు రూరల్

